ఆంధ్రజ్యోతి ప్రవాస

# జాతిపితకు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ ఘన నివాళి



**డల్లాస్:** అమెరికా సంరక్షణ కోసం అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా దేశమంతటా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విశ్వశాంతి కోసం కృషి చేస్తూ నేలకొరిగిన జాతిపిత మహాత్మా గాంధీకి డల్లాస్‌లోని ఉన్న అమెరికాలోనే అతిపెద్ద మహాత్మాగాంధీ మెమోరియల్ వద్ద పుష్పాంజలి ఘటించడం సముచితంగా ఉందని మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఛైర్మన్ డాక్టర్. ప్రసాద్ తోటకూర అన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, భారత, భాగవత పురాణ, ఇతిహాసాలు భగవద్గీత, బ్రహ్మ సూత్రాల్లాంటి అనేక ఆధ్యాత్మిక విషయాలపై వ్యాఖ్యానాత్మక ప్రవచనా పరంపరలతో కోట్లాది హృదయాల్లో భక్తి ప్రపత్తులు నింపిన ఒక మహాస్ఫూర్తి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ జాతిపితకు  శ్రద్ధాంజలి ఘటించడానికి హాజరవడం సంతోషకరమని డాక్టర్. ప్రసాద్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ తాను ఆచరించేవారని అనంతరమే ఇతరులకు చెప్పేవారని, అనునిత్యం సమాజ శ్రేయస్సే శ్వాసగా తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన అన్నారు.

కేవలం సనాతన ధర్మ విలువలు, వైశిష్ట్యాలను చాటి చెప్పడం, ఆధ్యాత్మిక ప్రభోధనలే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం, వివిధ భారతీయ కళలలో నిష్ణాత్తులైన వారికి పురస్కారాలు అందచేయడం, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, గోసంరక్షణా బాధ్యతలు చేపట్టడం అనే విషయాలే ధ్యేయంగా ఋషిపీఠం అనే ధార్మిక సంస్థ ద్వారా సేవ చేస్తున్న బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ కృషి అభినందనీయమని డాక్టర్. ప్రసాద్ తోటకూర కొనియాడారు.

డాక్టర్. సామవేదం షణ్ముఖ శర్మ మాట్లాడుతూ.. డల్లాస్ నగరంలో అన్ని జాతులు, మతాలు, ప్రాంతాల ప్రజలు కలిసికట్టుగా ముందుకు వచ్చి మహనీయుడు మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఇర్వింగ్ పట్టణంలో నెలకొల్పడంలో ప్రధాన పాత్ర పోషించిన ఛైర్మన్ డాక్టర్. ప్రసాద్ తోటకూర, కార్యదర్శి రావు కల్వల కృషి శ్లాఘనీయం అని అన్నారు.

"గాంధీ సిద్ధాంతాలలో ప్రముఖమైనవి సామరస్యం, శాంతి, భిన్నత్వం లో ఏకత్వం. భగవద్గీత లాంటి సనాతన ధర్మాలలో కూడా ఇవే చెప్పబడ్డాయి. ఇక్కడి విగ్రహ విశేషం ఏమిటంటే గాంధీ చేతిలో భగవద్గీత ఉండడం. భారతదేశపు

హృదయమే భగవద్గీత, దాన్ని తన చేతిలో పట్టుకొని చేతిలో చూపించారు” అని అన్నారు. గాంధీ స్వచ్ఛ భారతానికై కలలు కన్నారని, ప్రజల్లో శుభ్రత పట్ల అవగాహన కలిగించడానికి స్వయంగా పారిశుధ్య కార్యక్రమాలు చేసేవారని, ఇప్పుడు మన భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ కూడా అదే బాటలో పయనించడం విశేషమని అన్నారు. గోసంరక్షణ జరగాలని, గోసంరక్షణ అనేది ఒక మతానికి సంబంధించినది కాదని, అది భారతీయతకు సంబంధించినదని, స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటి సంతకం గోవధ నిషేధంపై జరగాలని మహాత్మా గాంధీ ఆశించారని ఆయన అన్నారు. ప్రస్తుతం గోవధ నిషేధ ఆశయ సాధనలో ప్రభుత్వం అడుగులు వేయడం సంతోషదాయకమని, అన్ని మతాలను సమంగా గౌరవించాలని, కానీ.. మత మార్పిడులను ప్రోత్సహించకూడదని ఆయన అన్నారు. గాంధీ విశ్వ మానవుడని, ఆయన చెప్పిన ప్రతి మాట ఆచరించగలిగితే భారత దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుందని, విశ్వ శాంతికై పాటుబడిన మహనీయుడి  విగ్రహం వద్ద ఈ రోజు నివాళులు అర్పించడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ పేర్కొన్నారు.

కార్యక్రమాలతో బిజీగా ఉండి కూడా నివాళులు అర్పించడానికి విచ్చేసిన డాక్టర్. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మకు కృతజ్ఞతలు తెలుపుతూ అయన ఇచ్చిన సందేశం అమూల్యమైనదని, అలాగే ప్రవాస భారతీయులుగా మేము చేస్తున్న సామాజిక సేవను అయన ప్రశంసించడం తమకు నూతన ఉత్తేజాన్ని కలిగిస్తోందని మహాత్మా గాంధీ మెమోరియల్ అఫ్ నార్త్ టెక్సాస్ కార్యదర్శి రావు కల్వల తన వందన సమర్పణలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి పట్టిసం, లక్ష్మి గుంటూరి, శర్మ గుంటూరి, సాంబు మంథా, డాక్టర్. నరసింహా రావు వేముల, ఎంపీఎల్ ప్రసాద్, కర్రా వెంకట్రావు, వెంకట్ ములుకుట్ల తదితరులు పాల్గొని జాతిపితకు నివాళులు అర్పించారు.